క్లుప్తంగా

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బోసుబొమ్మ సెంటర్ వద్ద ఓ ఇంట్లో మంగళవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం బోసుబొమ్మ సెంటర్‌లో సీపీఎం కార్యాలయం వెనుక భాగంలో అద్దె ఇంట్లో నివసించే సయ్యద్ మొహమ్మద్ ఇంట్లో ఫ్రిజ్ వద్ద షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి విద్యుత్ వైర్ల ద్వారా మంటలు అన్ని గదుల్లోకి వ్యాపించాయి. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు గ్యాస్ సిలెండర్‌ను బయటకు తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది. అరగంట వ్యవధిలో మంటల వ్యాపించడంతో వంట సామగ్రి, ఫర్నిచర్, ఇతర సామగ్రి బూడిద పాలయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు.

ఎక్కడ నివసించే వారికి అక్కడే పట్టాలు ఇవ్వాలి

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణంలో ఎక్కడ నివాసముంటున్న వారికి అక్కడే ప్రభుత్వం ఇళ్లపట్టాలు ఇవ్వాలని తాడేపల్లి పట్టణ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం పలు సచివాలయాల్లో అడ్మిన్లకు వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా తాడేపల్లి సీపీఎం కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ పరిధిలో 40–50 సంవత్సరాల నుంచి ఎంతోమంది పేదలు కొండ పోరంబోకు, రైల్వే స్థలాల్లో పక్కా ఇళ్లను నిర్మించుకుని ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నారని, ఎక్కడైతే పేదలు ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారో వారందరికీ అక్కడే ఇళ్లపట్టాలను ప్రభుత్వం ఇవ్వాలని అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని 6,14,15,16 సచివాలయాల్లో అడ్మిన్లకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం తరఫున వినతి పత్రాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. కొట్టె కరుణాకర్, దర్శనపు విజయ్, కొట్టె బాబూరావు, ఫిరోజ్, దేవకుమార్ పాల్గొన్నారు.

నుదురుపాడులో రెవెన్యూ సదస్సు



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడులో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామపరిధిలో ఉన్న అడంగల్, పట్టాదారు పాసు పుస్తకాలకు సంబంధించి 20 అర్జీలు, భూమి కొలతలకు సంబంధించి 5 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ జె.ప్రసాదరావు తెలిపారు. ఆర్ఐ అబ్దుల్ రెహమాన్, సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వో బాజి, ఎండోమెంట్ ఈఓ శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

బీసీల మధ్య అనైక్యతే వెనుకబాటుకు మూలం

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు

తాడేపల్లిరూరల్: ఆధునిక ప్రజాస్వామ్య యుగంలో ఎందరో బీసీలు చట్టసభల సభ్యులుగా, మంత్రులుగా ఉన్నప్పటికీ ఆత్మగౌరవంతో మన లేకపోవడానికి బీసీల మధ్య అనైక్యతే మూలకారణమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు అన్నారు. మంగళవారం మంగళగిరిలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూజీవీడులో గౌడ సంఘీయుల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమర యోధుడు, రైతు బాంధవుడు సర్దార్ గౌతు లచ్చన విగ్రహావిష్కరణ సందర్భంగా జరిగిన సంఘటన బీసీల మధ్య, బీసీ నాయకుల మధ్య పొరపొచ్చాలకు కారణం కావడం విచారకరమని అన్నారు. రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులను పిలవడమే దీనికి కారణమని అన్నారు. 29వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా వున్న సర్దార్ గౌతు లచ్చన విగ్రహాలన్నింటినీ పవిత్ర నదీ జలాలతో అభిషేకించాల్సిందిగా బీసీ నాయకులకు, మొత్తం బీసీ సమాజానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర యువజన అధ్యక్షుడు కుమ్మర క్రాంతి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎండు గడ్డి మృగ్యం.. పశుపోషణ భారం

- యంత్రాలతో వరికోత.. ఎండు గడ్డి కొరత
- ట్రాక్టర్ గడ్డి రూ. 17వేలు - రూ.20 వేలు
- పశుపోషణ కష్టంగా మారిందంటున్న పశుపోషకులు



చుట్టలు చుట్టిన గడ్డితో ఎండ్లబండి

తాడేపల్లిరూరల్: పశువుల పెంపకం రైతులకు భారంగా మారుతోంది. ప్రభుత్వ ప్రోత్సాహం కరువవడం.. కూలీల కొరత తదితర సమస్యలు పశు పోషకులను వేధిస్తున్నాయి. ఎండుగడ్డి తగినంత లేకపోవడం, పచ్చిక బయళ్లు, ఖాళీ బంజరు భూములు తగ్గిపోవడం వంటి కారణాలతో పశువులకు మేత కరువవుతోంది. దీంతో పశుపోషణ రైతులకు భారంగా మారింది. పూర్వం ప్రతి రైతు కమతం గొడ్లశాల, గడ్డివాము, పాడి పశువులతో కళకళలాడేది. నేడు ఏ రైతు మకాం చూసినా కళ్లాలు కళగా కనిపించడం లేదు. పల్లె ప్రజలు సైతం ప్యాకెట్ పాలపైనే ఆధారపడుతున్నారు. గతంలో ఓ సాధారణ రైతుకు వ్యవసాయంతో పాటు పశువుల పెంపకం ద్వారా అదనపు ఆదాయం చేకూరేది. గేదె పాలు ఇంటి అవసరాలకు పోను మిగిలిన పాలు విక్రయించుకోవడం ద్వారా కుటుంబ పోషణ జరిగిపోయేది. పల్లె సీమలంటేనే పాడి పంటలకు నెలవు. అటువంటి పల్లెల్లో వ్యవసాయం కళ తప్పుతోంది.

గడ్డి గగనమాయె..!

నియోజకవర్గ వ్యాప్తంగా ఆవుల ఫారం పెంపకందారులతో పాటు గేదెలను ఇంటింటికి పల్లెటూర్లలో పెంచుకుంటున్నారు. ఆ పశువుల నుంచి వచ్చే ఆదాయంతోనే చాలా కుటుంబాలు తమ జీవనాన్ని కొనసాగిస్తున్నాయి. పిల్లలను సైతం పాడిపెంపకం ద్వారా చదివించుకుంటున్నారు. ఒక గేదె లేదా ఆవుకు ఏడాది పొడవునా రెండున్నర ఎకరాల వరిగడ్డి అవసరం అవుతుంది. అదే పచ్చిగడ్డి ఉంటే రోజూ గేదెలను, ఆవులను మేతకోసం తోలుకు వెళితే ఎకరంన్నర గడ్డి సరిపోతుంది. గేదె లేదా ఆవు వెన్నశాతం పెరగాలంటే తప్పని సరిగా తవుడుతో పాటు ఎండుగడ్డి వేయాల్సి ఉంటుంది. గేదె లేదా ఆవు సరాసరిన నెలకు 120 లీటర్ల వరకు పాలు ఇస్తుంది. ఈ సంవత్సరం వరినాట్లు వేసిన దగ్గర నుంచి అనేక రకాల తుఫాన్లు రావడంతో దిగుబడి చాలా తగ్గింది. కూలి రేట్లు పెరగడంతో వరిని యంత్రాలతో కోస్తున్నారు. దీంతో ఎండుగడ్డి దొరకడం గగనంగా మారింది. ఎకరం ఎండుగడ్డి రూ.10వేలు పైన పలుకుతోంది.

ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం

పాడి పరిశ్రమకు పెద్దపీట వేస్తున్నామని చెప్పే ప్రభుత్వాలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయని రైతులు చెబుతున్నారు. గతంలో సైలేజ్ గడ్డిని రైతులకు సబ్సిడీపై అందించేవారు. ప్రస్తుతం ఇవ్వడం లేదు. పశుక్రాంతి పథకం ద్వారా సన్నచిన్నకారు రైతులకు పాడిపశువులకు రాయితీ అందించే పథకాన్ని నిలిపి వేశారు. పాడి పరిశ్రమ ప్రోత్సాహానికి సంక్రాంతి పర్వదినాల్లో పాల పోటీలు, పశువుల అందాల పోటీలు నిర్వహించేవారు. పశువులు మరణిస్తే బీమా వర్తించడం లేదు. పశు సమగ్ర క్షేత్రాలు, పశుగ్రాసం కోసం ఇచ్చే ప్రోత్సాహం నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో పాడి పశువుల పెంపకం రైతులకు గుదిబండలా మారింది. తద్వారా పశువుల సంఖ్య గణనీయంగా తగ్గి భవిష్యత్తులో పాడి పరిశ్రమ కనుమరుగై కృత్రిమ పాలు, ప్యాకెట్ పాలకే పరిమితమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పశువుల పెంపకం భారంగా మారింది



పాడి పశువుల పెంపకానికి ట్రాక్టర్ ఎండుగడ్డి ఇప్పుడు రూ.17 వేలు అయ్యింది. పశువులకు వాడే తవుడు క్వింటా రూ.3200కు చేరింది. మొక్కజొన్న పిండి 50 కిలోలు రూ.1200కి పెరిగింది. జొన్నల ధర 100 కిలోలు రూ. 1,600 నుంచి రూ. 3,500కి పెరిగింది. దీంతో పాటు పశుగ్రాసాలు, కూలి రేట్లు పెరగడంతో పశువుల పెంపకం గిట్టుబాటు కావడం లేదు. పెరిగిన ముడిసరుకు, పశువుల దాణా ధరలు తగ్గించి పాడి పరిశ్రమను పోత్సహించాలి.

– నాగిరెడ్డి, రైతు, ఉండవల్లి

కృష్ణాజిల్లా నుంచి ఎండుగడ్డి తేవాలి..



కృష్ణా జిల్లా నుంచి వరిగడ్డి కొనుగోలుచేయాలి. గత సంవత్సరం ఎకరం రూ.15 వేలకు కొన్నాం. ఇప్పుడు ఆ రేటు మరింత పెరిగింది. నాకు 10 గేదెలు ఉన్నాయి. ఎంత కాదనుకున్నా 7 నుంచి 9 ఎకరాల వరిగడ్డి కొనాలి. ఈ సారి వరిగడ్డి కొనుగోలు, వాము తొక్కించడం రూ.25 వేల వరకు ఖర్చు అవుతుంది. రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టాలి. ఇప్పుడు ఆ డబ్బుల కోసం వ్యాపారులను ఆశ్రయించాల్సిందే.

– పి.సుధాకర్, రైతు, చిర్రావూరు

సెప్టిక్ ట్యాంకర్ల నిర్వాహకులకు కౌన్సెలింగ్

సాక్షి ఎఫెక్ట్

తాడేపల్లిరూరల్: సెప్టిక్ వ్యర్థాలతో సెప్టిక్ ట్యాంకర్ల నిర్వాహకులు మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని రోడ్లను పాడుచేస్తున్న వైనంపై ఈనెల 23న 'కంపు చేస్తున్నారు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళగిరి రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకట్ సెప్టిక్ ట్యాంకర్ల నిర్వాహకులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలకు డంపింగ్ చేయడం ద్వారా వచ్చే దుర్వాసనతో ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలను విడుదల చేయరాని హెచ్చరించారు. ఈ విషయంపై ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని, వ్యర్థాల డంప్‌కు ప్రత్యేకంగా డంపింగ్ యార్డును ఏర్పాటు చేస్తామని తెలిపారన్నారు. బహిరంగ ప్రదేశాల్లో డంపింగ్ చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.



సెప్టిక్ ట్యాంకర్ల నిర్వాహకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న మంగళగిరి రూరల్ ఎస్ఐ వెంకట్

రేపటి నుంచి ఆధార్ క్యాంపులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలో మూడు రోజులు ఆధార్ క్యాంప్ నిర్వహించనున్నట్లు మండల ప్రజాపరిషత్ అధికారి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వ తేదీ తుమ్మపూడి, గొడవర్రు గ్రామాల్లో, 27వ తేదీ రేవేంద్రపాడు, పెదకొండూరు గ్రామాల్లో, 28వ తేదీ కంఠంరాజ కొండూరు, పెదపాలెం గ్రామాల్లో నిర్వహించనున్నారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

తాడికొండ: ఈ నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు తుళ్ళూరు మండలంలో ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కానూరి శిల్ప ఒక ప్రకటనలో తెలిపారు. 26న పెదపరిమి 1, మందడం 1 సచివాలయాలు, తుళ్ళూరు బాపూజీ హైస్కూల్‌లో, 27న పెదపరిమి 1, వెలగపూడి సచివాలయాలు, తుళ్ళూరు బాపూజీ హైస్కూల్‌లో, 28న అనంతవరం హైస్కూల్, మల్కాపురం సచివాలయం, అనంతవరం హైస్కూల్‌లో ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నారు.

'పోరుబాట'ను విజయవంతం చేద్దాం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డైమండ్ బాబు, పార్టీ నేతలు, కార్యకర్తలు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు
- 27న విద్యుత్ చార్జీల భారాన్ని నిరసిస్తూ తాడికొండ అడ్డరోడ్డులో ధర్నా
- పోస్టర్ విడుదల

తాడికొండ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 27న నిర్వహించ తలపెట్టిన ప్రజా సమస్యలపై పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) పిలుపునిచ్చారు. గుంటూరులోని పార్టీ తాడికొండ నియోజకవర్గ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి మంగళవారం పోస్టర్ విడుదల చేశారు. డైమండ్ బాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీఇచ్చిన చంద్రబాబు అధికారం చేపట్టిన తరువాత ఇష్టానుసారంగా విద్యుత్ చార్జీలు పెంచడం దారుణమన్నారు. ఇది ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం విద్యుత్ చార్జీలపై గత నెల రూ. 6072 కోట్లు, ఈ నెల రూ.9413 ఓట్లు మొత్తం కలిపి రూ. 15484 కోట్ల భారాన్ని ప్రజలపై భారం మోపారని మండిపడ్డారు. ప్రజల పక్షాన ఈనెల 27న వైఎస్సార్ సీపీ పోరుపాట కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. ప్రజలపై ప్రభుత్వం అదనంగా మోపి ముక్కు పిండి వసూలు చేస్తున్న విద్యుత్ చార్జీల భారాన్ని నిరసిస్తూ తాడికొండ అడ్డరోడ్డులో సబ్ స్టేషన్ వద్ద ఉదయం 10 గంటలకు చేయనున్న నిరసన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ పలు విభాగాల నాయకులు బత్తుల కిషోర్, మార్పుల శివరామిరెడ్డి, బొర్రా వెంకటేశ్వర్ రెడ్డి, ముప్పాళ్ళ మనోహర్, కొప్పుల శేషగిరిరావు, తాళ్లూరు వంశీ, నాయుడు నాగేశ్వరరావు, ఆరేపల్లి జోజి, డీజే శ్రీనివాసరావు, షేక్ అబ్బాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతటా క్రిస్మస్ సందడి




క్రిస్టియన్ పేటలో విద్యుత్ దీపాలతో అలంకరించిన ఆర్‌సీఎం చర్చి



తాడేపల్లి 1వ వార్డులో క్రీస్తు కృపాలయానికి ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు

- విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబైన చర్చిలు
- కొనుగోలుదారులతో దుకాణాలు కిటకిట

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోను, దుగ్గిరాల మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో క్రిస్మస్ సందర్భంగా మంగళవారం చర్చిలను, ప్రార్థనా మందిరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ సందర్భంగా పలు చర్చిల వద్ద పశువుల పాక ఏర్పాటు చేసి, క్రిస్మస్ ట్రీని, క్రిస్మస్ తాత బొమ్మలను ఏర్పాటు చేసి, శుభాకాంక్షలు తెలియజేస్తూ భారీ ఏర్పాట్లు చేశారు.



క్రిస్టియన్‌పేట క్రీస్తు కృపాలయం వద్ద రెయిన్‌డీర్ బండిపై వస్తున్న క్రిస్మస్ తాత నమూనా

అక్రమంగా మట్టి, ఇసుక తరలిస్తే సహించం

తాడేపల్లిరూరల్: మంగళగిరి రూరల్ పరిధిలో నవులూరు గ్రామంలో అక్రమ మైనింగ్ నిర్వహించే కొంతమందికి మంగళగిరి రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ నవులూరులో అక్రమంగా మట్టి, ఇసుక రవాణా చేస్తున్న వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారని, నవులూరు గ్రామీణ ప్రాంతంలో అక్రమంగా మట్టి, ఇసుక తరలిస్తున్న వారిని గుర్తించి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని, మంగళగిరి తహసీల్దార్ వద్ద హాజరు పరిచి రూ.5 లక్షల పూచీకత్తుపై వారిని విడుదల చేసినట్లు తెలిపారు. మొత్తం 15 మందిపై చర్యలు తీసుకున్నామని, ఎక్కడైనా రూరల్ పరిధిలో మైనింగ్ శాఖ అనుమతులు లేకుండా మట్టి, ఇసుక తవ్వకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకట్ తెలిపారు.

డైమండ్ బాబు క్రిస్మస్ శుభాకాంక్షలు



తాడికొండ: తాడికొండ నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచవ్యాప్తంగా కులమతాలకు అతీతంగా జరుపుకొనే క్రిస్మస్ పండుగను ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్దలతో జరుపుకోవాలన్నారు. ప్రతి ఇంటా క్రిస్మస్ కాంతులు వెలగాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య

తాడేపల్లిరూరల్: పేద, బడుగు, బలహీన వర్గాల కోసం అనేక పోరాటాలను సీపీఐ చేస్తుందని పార్టీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అన్నారు. మంగళవారం మంగళగిరి పట్టణ పరిధిలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్ సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందేళ్లు పూర్తి చేసుకుంటున్న ఘన చరిత్ర కలిగిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. ఈనెల 26వ తేదీన పార్టీ శత వసంత ఉత్సవాలను పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించనున్నామని, ఈ ఉత్సవాల సభలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు. సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

తాడేపల్లిరూరల్: మంగళగిరి ఎక్సైజ్ శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు చేసి తాడేపల్లి ఉండవల్లి సెంటర్ ముఖ్య కూడలిలో అక్రమంగా మద్యం అమ్ముతున్న రమాదేవి అనే మహిళను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద ఉన్న 9 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా ఎక్సైజ్ శాఖ అధికారులు బెల్టు షాపులు నిర్వహిస్తూ మద్యం అమ్మేవారిపట్ల ఉదాసీనంగా ఉన్నారని, ఒకరిద్దరిపై మాత్రమే చర్యలు తీసుకుంటున్నారని, అక్రమంగా మద్యం విక్రయించేవారు తాడేపల్లి పట్టణ పరిధిలో ప్రధాన రహదారుల్లోనే అనేకమంది ఉన్నారని, మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ రహదారిలో బహిరంగంగా ఆరుచోట్ల బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని, బహిరంగంగా మద్యం అమ్ముతున్నా వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, ఎంతోమంది ఫిర్యాదు చేసినా వారి పేర్లను బహిర్గతం చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉండవల్లి, పెనుమాక, గుండిమెడ, కొలనుకొండ, వడ్డేశ్వరం ప్రాంతాల్లో మొబైల్ బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నా ఎక్సైజ్ అధికారులు పట్టీపట్టనట్లు ఉంటున్నారని ప్రజలు చెప్పుకొంటున్నారు.

మాట తప్పిన ప్రభుత్వంపై పోరుబాట

- 27న పెంచిన విద్యుత్ చార్జీలపై వైఎస్సార్ సీపీ పోరుబాట
- పోస్టర్‌ను ఆవిష్కరించిన దొంతిరెడ్డి వేమారెడ్డి, నేతలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, నాయకులు

తాడేపల్లిరూరల్: ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఊరూరా తిరిగి తాము ఒక్క రూపాయి కూడా కరెంట్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చారని, సాక్షాత్తు నారా చంద్రబాబు నాయుడు సైతం ఎన్నోసార్లు కరెంటు చార్జీలు పెంచమంటూ ఊదరగొట్టి అధికారంలోకి వచ్చారని, అయితే అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే విద్యుత్ చార్జీలను అమాంతం పెంచేసి ప్రజలను మోసం చేసి, పేదల నడ్డి విరిచారని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మంగళగిరి రూరల్ ఆత్మకూరులోని నియోజకవర్గ కార్యాలయంలో ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహనరావు, తాడేపల్లి రూరల్ పార్టీ అధ్యక్షుడు అమరా నాగయ్య, మంగళగిరి పార్టీ కన్వీనర్ ఆకురాతి రాజేష్, నాయకులతో కలసి కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కష్టపడి సంక్షేమాలకు పెద్దపీట వేసి పేద ప్రజలను అనేక రకాలుగా ఆదుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ఈక్రమంలో సర్‌చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై బిల్లుల బాదుడుకు తెరలేపారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 27న మంగళగిరిలో ధర్నా నిర్వహించనున్నామని, ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. అనంతరం పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. తాడిబోయిన శివగోపయ్య, నాళి వెంకట కృష్ణ, దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, దామర్ల కుమారస్వామి, పారేపల్లి రామకృష్ణ, దొడ్డ కృష్ణ, పెరికలపూడి సర్పంచ్ గంపల గంగాధర్, తాడిబోయిన సుబ్బారావు, సురేష్, బొక్క అగస్టీన్, షేక్ మాలిక్ బాబు, షేక్ సుభాని, నాగయ్య, గంజి షణ్ముఖ, మల్లవరపు సుధారాణి, గుంటి రాజ్యలక్ష్మి, కర్ర జ్యోతి, మిట్టా నిర్మల పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

తాడేపల్లిరూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని తాడేపల్లి ఎస్ఐ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని నివాసాల మధ్యలో రోడ్డుపై మద్యం తాగుతున్నారని సమాచారం రావడంతో ఎస్ఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి వెళ్లి రోడ్డుపై మద్యం తాగుతున్న మరుమాక అనిల్, విద్యాసాగర్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని ప్రభుత్వం నిషేధించిందని, మద్యం బాబులు ప్రజలను ఇబ్బంది పెడుతూ నివాసాలమధ్యలో రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే సహించేది లేదని, ఎక్కడైనా అలాంటి సంఘటనలు ఎదురైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

గోదా దేవికి సారె సమర్పణ



తాడేపల్లిరూరల్: ధనుర్మాసం సందర్భంగా శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్‌స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో ధనుర్మాస మహోత్సవాలను మంగళవారం మంగళగిరిలోని బాపూజీ విద్యాలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా 9వ పాశురాన్ని త్రిదండి చిన్నజీయర్ స్వామి భక్తులకు వివరించారని, గోదా అమ్మవారికి అష్టోత్తరం నిర్వహించామని, సుమారు 350 మంది భక్తులు గోదా అమ్మవారికి సారె సమర్పించారని తెలిపారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కూచిపూడి నృత్యాలను భక్తులను అలరింపజేశాయని, ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని ఆయన తెలిపారు.